సాక్షి రంగారెడ్డి

సోమవారం । 6 । మార్చి । 2023



పాలకులతోనే నిరుద్యోగ సమస్య

పాలకుల విధానాలతోనే యువత ఉద్యోగాలు లేక నిరాశ, నిస్పృహలో ఉన్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి అన్నారు. 8లో▸



సమస్యల పరిష్కారానికి కృషి

మీర్‌పేట పరిధిలో ఇంటి పన్నులు, యూఎల్‌సీ సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని మంత్రి సబితారెడ్డి తెలిపారు. 8లో▸



అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపుదాం

బీఆర్ఎస్ హయాంలో అవినీతి హెచ్చుమీరిందని, ఈ ప్రభుత్వాన్ని సాగనంపుదామని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. 8లో▸

న్యూస్‌రీల్

రియల్ ఎస్టేట్ రంగంలో అపార అవకాశాలు



శిక్షణలో మాట్లాడుతున్న డాక్టర్ శివకుమార్

మొయినాబాద్: రియల్ ఎస్టేట్ రంగంలో యువతకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ప్రముఖ లైఫ్ కోచ్, రియల్ ఎస్టేట్ ట్రెనింగ్ నాచురోపతి ప్రాక్టీషనర్ డాక్టర్ శివకుమార్ అన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డి గూడ రెవెన్యూలో ఉన్న మీమాంస వెల్‌నెస్ రిసార్ట్స్‌లో ఆదివారం సుమారు రెండు వేల మందికి రియల్ ఎస్టేట్ మార్కెటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయం రంగం తరువాత అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్న రంగం రియల్ ఎస్టేట్ అన్నారు. దేశ అభివృద్ధికి రియల్ ఎస్టేట్ రంగం ఎంతో దోహదం చేస్తుందన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో ప్రొఫెషనల్‌గా డీల్ చేస్తే సుదీర్ఘ కాలం నిలదొక్కుకోవచ్చన్నారు. నిజాయితీ, నిబద్ధతతో స్థిరాస్తి సెల్లర్‌కు బయ్యర్‌కు సర్వీస్ అందించాలని.. అప్పుడే ఈ రంగంలో సక్సెస్ అవుతామన్నారు. కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన రియల్ వ్యాపారంపై ఆసక్తి ఉన్నవారు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

టీవీవీ రాష్ట్ర కోశాధికారి టీజీ శ్రీనివాస్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కోశాధికారి టీజీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును ఈనెల 12న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఎంతోమంది పోరాటం చేశారని అన్నారు. ఉద్యమకారులకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. ఉద్యమ కారుల సంక్షేమం కోసం బోర్డును ఏర్పాటు చేసి రూ.పదివేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల్లో ఉద్యమకారులకు 20 శాతం కేటాయించాలని, నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని, ఉచిత బస్ పాస్ సౌకర్యం, ఇంటి స్థలం, వడ్డీలేని రుణాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ఉద్యమ సాధన కోసం ప్రాణాలర్పించి అమరులైన కుటుంబాలకు రూ.పదిలక్షలతో పాటు ఉద్యోగం ఇవ్వాలన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనా సీమాంధ్ర కార్పొరేట్ వర్గాల ఆధిపత్యం అన్ని రంగాల్లో కొనసాగుతోందని, కార్పొరేట్ వర్గాల పెత్తనం లేకుండా సంపూర్ణ తెలంగాణ కోసం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పని చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు అర్జునప్ప, రవీంద్రనాథ్, సత్యం, కృష్ణయ్య, నర్సింలు, కిష్టప్ప, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారాన్ని సాధిద్దాం

డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్



స్వరాజ్య పాదయాత్రలో డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్

ఇబ్రహీంపట్నం: గల్లీ నుంచి ఢిల్లీ పీఠం వరకు రాజ్యాధికారాన్ని సాధిద్దామని దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు డా. విశారదన్ మహరాజ్ అన్నారు. శనివారం రాత్రి పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర ఇబ్రహీంపట్నం చేరుకుంది. ఈ సందర్భంగా డీఎస్పీ జెండా, పాదయాత్రకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పది శాతం లేని అగ్రకులాలు ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని ఏలినప్పుడు 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు ఏలొద్దా అని ప్రశ్నించారు. డీఎస్పీ జెండా భారత రాజ్యాంగాన్ని రక్షిస్తూ, అణగారిన వర్గాలకు అండగా ఉంటుందన్నారు. సబ్బండ వర్గాలని చైతన్యపరిచి, ఏకం చేసి స్వరాజ్యాన్ని సాధించేదిశగా ఈ పాదయాత్ర చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్, ప్రోగ్రాం ఇన్‌చార్జి లక్ష్మణ్, రెహమాన్, దుర్గాప్రసాద్, రవీందర్, రాకేశ్ పాల్గొన్నారు.

నిలదీస్తారా.. మౌనం వహిస్తారా?

- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- జిల్లాలో అపరిష్కృతంగా అనేక సమస్యలు
- ఆయా అంశాలపై సభ్యులు లేవనెత్తేనా?
- బాధితులు, ఆశావహుల ఎదురుచూపులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రజా సమస్యల ప్రస్తావన, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, చేపట్టిన అభివృద్ధి పనులు, పెండింగ్ సమస్యలపై నిలదీతే లక్ష్యంగా నిర్వహించే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆయా సమస్యలపై ప్రశ్నల వర్షం సంధిస్తారా..? లేక కిమ్మనకుండా వెనుతిరుగుతారా చూడాలి. సోమవారం ఉదయం 11 గంటలకు ఖైరతాబాద్‌లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్ పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. మంత్రి సబితారెడ్డి, కలెక్టర్ హరీశ్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా స్థాయి అధికారులు హాజరుకానున్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు క్షేత్ర స్థాయి సమస్యలకు పరిష్కారమార్గం చూపించాలని కోరుతుండడం తెలిసిందే. గత జెడ్పీ సమావేశాల్లో చర్చించిన సమస్యలే ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు. ప్రస్తుతం పెండింగ్ అంశాలతో పాటు కొత్తగా మరికొన్ని అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.

గూడు గోడు వినేనా..?

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం జిల్లావ్యాప్తంగా లక్షకుపైగా దరఖాస్తులు అందాయి. ప్రభుత్వం ఇప్పటి వరకు 6,777 ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. వీటిలో 2,500 మాత్రమే పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఇళ్లు లేని నిరుపేదలు ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. వారి గోడును పట్టించుకున్న నాథుడే లేడు. మరోవైపు ఇళ్ల స్థలాల కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, కందుకూరు, చేవెళ్ల తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వారు వేసుకున్న గుడిసెలను తొలగిస్తున్నా.. మళ్లీ మళ్లీ వెలుస్తూనే ఉన్నాయి. ఈ సమస్యకు ఈ సమావేశంలోనైనా ఓ పరిష్కార మార్గం చూపిస్తారా? లేదో వేచి చూడాల్సిందే.

పోడుకు పరిష్కారం చూపేనా..?

ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, మంచాల మండలాల పరిధిలో 842 పోడు భూములు ఉన్నట్లు అంచనా. అటవీ, ప్రభుత్వ భూములను రైతులు ఆక్రమించుకుని సాగు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వీటి రెగ్యులరైజేషన్ కోసం 1,086 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికీ లబ్ధిదారుల ఎంపికపూర్తి కాలేదు. జిల్లాలో అసలు పోడు వ్యవసాయమే లేదని అధికారులు చెబుతుండడం విశేషం. ఈ నేపథ్యంలో ఈ భూములకు హక్కులు కల్పిస్తారా? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆంక్షల ఉల్లంఘనలపై చర్చించేనా?

జిల్లాలో జీఓ నంబర్ 58,59 కింద ప్రభుత్వానికి 30 వేలకుపైగా దరఖాస్తులు అందాయి. ఇవి ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉండిపోయాయి. ప్రస్తుత మార్కెట్ ప్రకారం ఆయా భూములను రెగ్యులరైజ్ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం, ఈ మేరకు రూ.లక్షల్లో చెల్లించాల్సిందిగా అధికారుల నుంచి తాఖీదులు అందుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ అంశంపై కూడా చర్చించే అవకాశం ఉంది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ పరిధిలో ఆంక్షల ఉల్లంఘనలు, అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ భూముల కబ్జాలు వంటి అంశాలపై ప్రతిపక్ష సభ్యులు అధికారపక్షాన్ని నిలదీసే అవకాశం లేకపోలేదు.

ఫార్మా బాధితులకు న్యాయం జరిగేనా?

ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం చేపట్టిన భూ సేకరణలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితులకు కాకుండా ఇతరులకు ప్రభుత్వ సాయం అందించినట్లు ప్రచారం జరుగుతోంది. బఫర్‌జోన్‌పై రోజుకో రకమైన ప్రచారం జరుగుతోంది. ఈ అంశంపై ఆయా గ్రామాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా గ్రామాలకు వెళ్లేందుకు కూడా సాహసించడం లేదు. ఈ అంశంపై సభ్యులు చర్చిస్తారో? లేదో వేచి చూడాల్సిందే.

కరెంట్ 'కోత'లపై ..

జిల్లాలో కరెంట్ కోతలు షురూ అయ్యాయి. వ్యవసాయానికి తొమ్మిది గంటలకు మించి సరఫరా కావడం లేదు. మోటార్లు పని చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. ఈ ఖర్చులను రైతులే భరించాల్సి వస్తోంది. కొత్త మీటర్ల జారీ, లైన్లు, ప్యానల్ బోర్డుల మంజూరులో ఇంజనీర్లు భారీగా చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. చాలా చోట్ల ఇంటిపైన చేతికందేంత ఎత్తులో లైన్లు ఉన్నాయి. వీటిని సరి చేయాల్సిందిగా స్థానికులు విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న దాఖలాలు ఉండటం లేదు.

వారికి 'ఆసరా' అవుతారా..?

ప్రస్తుతం జిల్లాలో 2,07,516 మంది వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, కల్లుగీత, చేనేత, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, డయాలసిస్ బాధితులు ఉన్నారు. వీరికి ఇటీవల ఆసరా కార్డులు జారీ చేశారు. వీరిలో కొంత మందికి పింఛను పైసలు ఇప్పటికీ అందడం లేదు నెలల తరబడి వీరంతా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వీరితో పాటు మరికొంత మంది దరఖాస్తుదారు లు పింఛను కోసం ఎదురు చూస్తున్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు భరోసా

మాజీ ఎంపీ హనుమంతరావు



జోడో యాత్రలో భాగంగా ప్రజలను పలకరిస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

హుడాకాంప్లెక్స్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదల బతుకులు మారుతాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. సరూర్‌నగర్ డివిజన్‌లో ఆదివారం 3వ రోజు నిర్వహించిన హాత్‌సే హాత్ జోడో అభియాన్ యాత్రలో ఆయన పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, పార్టీ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డితో కలిసి వెంకటేశ్వర కాలనీ, భగత్‌సింగ్‌నగర్‌లో పర్యటించారు. చిన్నా, పెద్ద అందరినీ పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని అన్నారు. పేదల బ్యాంకుల్లో రూ.15 లక్షలు ఎప్పుడు వేస్తారని, దేశం విడిచి పారిపోయిన విజయ్‌మాల్యా, నీరవ్‌మోదీలను ఎప్పుడు ఇండియాకు తీసుకొస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్ల పార్టీ అధ్యక్షులు పున్న గణేశ్‌నేత, చిక్కుళ్ల శివప్రసాద్, ఏనుగు జంగారెడ్డి, చిలుక ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు -రంగారెడ్డి' సందర్శన



పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును సందర్శించిన ప్రజాప్రతినిధులు

చేవెళ్ల: తెలంగాణ ప్రభుత్వం ఉమ్మడి జిల్లా ప్రజలకు తాగు, సాగునీటిని అందించేందుకు చేపట్టిన పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి జిల్లా ప్రజలకు అందించేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులతో కలిసి ఆదివారం బస్సుల్లో ప్రత్యేకంగా నాగర్ కర్నూలు జిల్లాలోని వీరాంజనేయ జలాశయం (ఏదుల), కురుమూర్తిరాయ జలాశయం (కరివెను), ఉద్దండపూర్ జలాశయం (ఉద్దండపూర్)ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రాజెక్టు పనులు జరుగుతున్నా ప్రతిపక్షపార్టీలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు ప్రాజెక్టుపై అవగాహన ఉండాలన్న ఉద్దేశంతో స్వయంగా పరిశీలించినట్లు తెలిపారు. త్వరలోనే ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని ప్రజలకు భరోసా కల్పించాలని ఎంపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులకు సూచించారు.

ప్రశాంతంగా సీఓఈ పరీక్ష

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గురుకుల కళాశాలలో తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాయాల సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష కొనసాగింది. మొత్తం 337 మంది విద్యార్థులకుగాను 312 మంది విద్యార్థులు హాజరుకాగా 25 మంది గైర్హాజరయ్యారు. ఈ ప్రవేశ పరీక్షకు మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం, కూకట్‌పల్లి ప్రాంతాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సెంటర్‌ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) కళాశాలలో ప్రవేశం లభిస్తుందని ప్రిన్సిపాల్ విద్యుల్లత తెలిపారు.

పర్యావరణ హితం.. హోలీ సంబరం

- ఆచార్య జయశంకర్ వర్సిటీలో సహజసిద్ధ రంగులు
- చెట్ల బెరడు, విత్తనాలు, పూల నుంచి తయారీ
- ఈ రంగులకు పెరుగుతున్న డిమాండ్
- కోవిడ్ తర్వాత మరోసారి అందుబాటులోకి..



సాక్షి, సిటీబ్యూరో: ఆనందాల రంగుల పండుగ హోలీ వచ్చేసింది. నేలపైన హరివిల్లు విరిసినట్లు.. మనుషులంతా ఒక్కసారిగా అనేక రంగుల్లో కనిపించే హోలీ సంబరాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. పిల్లలు, పెద్దలు అంతా ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొంటారు. ఇదంతా నాణేనికి ఒకవైపు.. మరోవైపు హోలీ సందర్భంగా వినియోగించే కృత్రిమ సింథటిక్ రంగులు హాని చేస్తాయి. రకరకాల ఎలర్జీలకు గురి చేస్తాయి. కొన్ని రకాల రంగులు కళ్లలో పడితే కళ్లకు సైతం తీవ్ర నష్టం జరుగుతుంది. ఎలాంటి హాని తలపెట్టని ఆరోగ్యకరమైన సహజసిద్ధ రంగులు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. ఐదారేళ్లుగా ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సహజ రంగులను అందుబాటులోకి తెచ్చింది. హోలీ వేడుకల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన రంగులను హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. కోవిడ్ కారణంగా గతేడాది వరకు సహజ రంగుల తయారీని నిలిపివేశారు. తిరిగి ఈ ఏడాది ఐదు రకాల సహజమైన రంగులను తయారు చేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తయారు చేసిన ఈ సహజమైన రంగులను అతి తక్కువ ధరల్లోనే విక్రయించనున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. సింథటిక్ రంగులకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఉండే ఈ రంగులు చర్మానికి ఎలాంటి హానీ చేయవు. వేడుకల అనంతరం నీటితో కడిగేస్తే చాలు.. ఎలాంటి ఆనవాళ్లు కూడా కనిపించవని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీపూజ తెలిపారు.

చెట్ల బెరడు, పూలే రంగులు..

సహజమైన రంగుల తయారీ కోసం వర్సిటీలో ప్రత్యేకమైన యంత్రాలు ఉన్నాయి. అప్పెరల్ అండ్ టెక్స్‌టైల్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ రంగులను తయారు చేస్తున్నారు. హోలీ రంగులతో పాటు, వస్త్రాలకు అద్దే సహజరంగులను కూడా ఈ విభాగం తయారు చేస్తోంది. ప్రస్తుతం హోలీ వేడుకలను దృష్టిలో ఉంచుకొని నారింజ, పసుపు, ఆకుపచ్చ, నీలి, పింక్ రంగులను సిద్ధం చేశారు. ఈ రంగుల కోసం అన్నాట్టో గింజలు, బంతిపూలు, మోదుగుపూలు, జాఫ్రానీ గింజలు, సప్పన్‌వుడ్, ఫారెస్ట్ ఇండిగో వంటి చెట్ల బెరడులను వినియోగిస్తున్నారు. మోదుగుపూలు, నీలి రంగు కలిపి ఆకుపచ్చ రంగును తయారు చేస్తున్నారు. పసుపువర్ణం కోసం రకరకాల బంతిపూలను వినియోగిస్తున్నారు.

ఇలా అందుబాటులో..

ఈ సహజమైన రంగులను సైఫాబాద్‌లోని హోం సైన్స్ కళాశాల వద్ద విక్రయానికి ఉంచనున్నారు. నగరంలోని పలు స్వచ్ఛంద సంస్థలు, ఎమరాల్డ్ స్వీట్‌షాపు, గో గ్రీన్ వంటి సంస్థలు ఈ సహజ రంగులను విక్రయించనున్నాయి. కొన్ని సూపర్‌మార్కెట్‌లలో కూడా ఈ రంగులను అందుబాటులో ఉంచినట్లు అధికారులు చెప్పారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విక్రయించే స్టాళ్లలో రూ.21కి 50 గ్రాముల ప్యాకెట్‌లు, 100 గ్రాములకు రూ.43 చొప్పున లభిస్తాయి. 250 గ్రాముల సహజ రంగుల పౌడర్ రూ.106కు లభిస్తుంది. అరకిలో, కిలో ప్యాకెట్‌లు కూడా ఉన్నాయి. కిలోకు రూ.425 చొప్పున ధర నిర్ణయించారు. సహజమైన రంగులను కొనుగోలు చేసేవారు హోంసైన్స్ కళాశాలలోనూ, రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీలోనూ సంప్రదించవచ్చు.

మాసబ్ చెరువుపై 'రియల్' కన్ను

- ఎఫ్‌టీఎల్ పరిధిలో యథేచ్ఛగా మట్టి డంప్
- రాత్రి వేళ టిప్పర్ల సాయంతో తరలింపు
- కంట పడకుండా రోడ్డు వెంట షేడ్‌నెట్ ఏర్పాటు
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు



సాగర్ రహదారి వెంట ఏర్పాటు చేసిన షేడ్‌నెట్

తుర్కయంజాల్: కాదేదీ కబ్జాల కనర్హం అన్నట్లు ఆక్రమణదారులు ఏదీ వదిలిపెట్టడం లేదు. పురపాలక సంఘం పరిధిలోని మాసబ్ చెరువుపై రియల్ మాఫియా కన్ను పడింది. రాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా పదుల కొద్ది టిప్పర్లతో మట్టిని డంప్ చేస్తున్నా ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. సాగర్ రహదారి వెంట గ్రీన్‌షేడ్ నెట్‌ను కంచెగా ఏర్పాటు చేసి, రాత్రి 10 గంటలు దాటాక మట్టిని డంప్ చేస్తున్నారు. తుర్కయంజాల్ రెవెన్యూ సర్వే నంబర్ 205లోని సుమారు రూ.300 కోట్ల విలువైన ఈ భూమిపై ఎందరో కళ్లు పడ్డా.. చెరువు నిండా నీరుండటంతో వెనకడుగు వేస్తూ వస్తున్నారు. తాజాగా తెరవెనుక ఉన్న పెద్దల అండదండలతో యథేచ్ఛగా మట్టిని డంప్ చేస్తూ చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతాన్ని ఆక్రమించే పనిలో నిమగ్నమయ్యారు. మాసబ్ చెరువు మొత్తం 499 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఇందులో 320 ఎకరాలు శిఖం భూమికాగా, మిగిలినవి పట్టా భూములే. హెచ్‌ఎండీఏ రూ.2 కోట్ల వ్యయంతో చెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్‌గా మార్చడంతో ఏడాది క్రితం మంత్రి కేటీఆర్ పనులు ప్రారంభించారు. ఆ సమయంలో చెరువు అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. చెరువు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

2016లో ఎన్‌ఓసీ..


సర్వే నంబర్ 205లోని 12 ఎకరాల పట్టా భూమికి 2016లో ఇరిగేషన్ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం పొందినట్లు సమాచారం. దీనికి అప్పటి తుర్కయంజాల్ పంచాయతీ పాలకవర్గం 'మాకు ఏ ఇబ్బందీ లేదు' అంటూ లెటర్ ఇవ్వడం వివాదానికి దారితీ సింది. తరువాత కొన్ని రోజులకు ఈ విషయం ఈ నోటా.. ఆ నోటా బయటకు పొక్కడంతో ఎన్‌ఓసీని రద్దు చేయాలని పలువురు స్థానిక ప్రజాప్రతినిధు లు, నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశా రు. నేటికీ ఆ ఎన్‌ఓసీ రద్దు కాలేదని సమాచారం.

మూడేళ్లుగా నిండా నీరే...

2020 అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు చెరువు నిండా నీరు నిండి 50 ఏళ్ల తరువాత అలుగు పారిన విషయం తెలిసిందే. ఆ సమయంలో చెరువు శిఖం భూమితో పాటు, బఫర్‌జోన్‌లోనూ పెద్ద ఎత్తున నీరు నిలిచింది. వరుసగా మూడేళ్లుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో చెరువు నీటి మట్టం తగ్గడం లేదు. తాజాగా మట్టిని డంప్ చేస్తున్న భూమిలో 5 నుంచి 7 అడుగల మేర నీరు నిలిచే ఉంది. ఎన్నో సార్లు ఇరిగేషన్ అధికారులను మేనేజ్ చేసి తూము ద్వారా నీటిని బయటకు పంపించాలని పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేశారు. దీనిపై పలుమార్లు సాక్షిలో కథనాలు ప్రచురించడం, స్థానికుల ఫిర్యాదుతో అధికారులు వెనక్కి తగ్గి తూమును మూసి వేస్తూ వస్తున్నారు. వేసవికాలం కావడం, తూము నుంచి నీటిని బయటకు పంపుతుండటంతో ఇదే సరైన సమయంగా భావించి రాత్రి వేళల్లో ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో మట్టిని నింపే పనులు జోరుగా కొనసాగిస్తున్నారు.

ప్లాట్లుగా మార్చాలనే కుట్ర..

ఈ భూమిని వెంచర్‌గా మార్చి ప్లాట్లను విక్రయించాలనేది రియల్ వ్యాపారుల కుట్ర. దీనికి కొందరు అధికారులు అండగా నిలవడంతో గతంలోనే పని కానిచ్చేయాలని చూశారు. ప్రకృతి కరుణించకపోవడంతో తాజాగా నీటితో నిండి ఉన్న చెరువులో మట్టి డంప్ చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో మట్టిని పోయడం ద్వారా ఇప్పటికే నిండా మునిగి ఉన్న ఆదిత్యా నగర్ కాలనీ వాసులకు మరిన్ని ఇబ్బందులు తప్పవు.



చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో డంప్ చేసిన పెద్దపెద్ద బండరాళ్లు

సహించేది లేదు..

చెరువు వద్దకు మా సిబ్బందిని పంపించి వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తాం. మట్టిని డంప్ చేసే వారు ఎవరైనా వదిలిపెట్టకుండా చట్టరీత్యా కేసులు నమోదు చేయిస్తాం. ఎన్‌ఓసీని పరిశీలించి వివరాలు వెల్లడిస్తాం. చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో పట్టా పొలాలు ఉన్నప్పటికీ అన్యాక్రాంతం చేయాలని చూస్తే సహించం.

– భన్సీలాల్, ఈఈ, ఇరిగేషన్ శాఖ

పాలకులతోనే నిరుద్యోగ సమస్య

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి



మాట్లాడుతున్న రవీంద్రాచారి, తదితరులు

మీర్‌పేట: పాలకుల విధానాల వల్లే దేశంలోని యువత ఉద్యోగాలు లేక నిరాశ నిస్పృహలో ఉన్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రాచారి అన్నారు. ఆదివారం మీర్‌పేట లెనిన్ నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన అఖిల భారత యువజన సమైక్య మండల స్థాయి సమావేశానికి రవీంద్రాచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేయడంతో పాటు కనీసం ఖాళీ పోస్టులను కూడా భర్తీ చేయలేదని ఆరోపించారు. ఉచిత విద్య, వైద్యం, ఉపాధి కోసం యువత పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. యువజన సమైక్య జిల్లా అధ్యక్షుడు పోలోజు లక్ష్మణాచారి మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, కుల, మత రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ బాలాపూర్ మండల కార్యదర్శి అయోధ్య వెంకటరమణారెడ్డి, నాయకులు డీ శేఖర్, నరేందర్, రాజు, రాజేష్, రాజశేఖర్, అఖిల్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపుదాం



మహిళతో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి

ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి

తలకొండపల్లి: బీఆర్‌ఎస్ హయాంలో అవినీతి హెచ్చుమీరిందని, ఈ ప్రభుత్వాన్ని సాగనంపుదామని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జూలపల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోకూరు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎనిమిదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతుందని ఆరోపించారు. మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్న బీఆర్‌ఎస్ నేతలు ప్రజా సమస్యలను పట్టించుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో అరాచక పాలన కొనసాగుతుందని, ఈ పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించకుండా సీఎం కేసీఆర్ తన కుటుంబంలో ఉన్న వారందరికీ ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన సమయంలో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ సీఎం కేసీఆర్ హయాంలో అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన హామీలను విస్మరించాయని ఆరోపించారు. దేశం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని, రైతులు అప్పులతో బాధపడుతున్నారని, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి సామాన్య ప్రజలు బతకలేని స్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్య గుప్తా, సోషల్ మీడియా అసెంబ్లీ ఇన్‌చార్జ్ అజీం, అసెంబ్లీ కార్యదర్శి రవీందర్‌యాదవ్, సేవాదళ్ అధ్యక్షుడు దశరథం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిక్యా నాయక్, నాయకులు యాట నర్సింహ, డిగ్రీ కృష్ణయ్య, చెన్నకేశవులు, అరీఫ్, తిరుపతి, ప్రవీణ్, మురళి, వినోదు, అభిషేక్, వెంకటయ్య, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కుక్క దాడిలో వ్యక్తి, దూడకు గాయాలు



కుక్కదాడిలో గాయపడిన రాజ్యానాయక్

కడ్తాల్: మండల పరిధిలోని సాలార్‌పూర్ తండాలో ఆదివారం మధ్యాహ్నం కుక్క దాడిలో ఓ వ్యక్తితో పాటు ఆవుదూడ తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాలు.. సాలార్‌పూర్ తండాకు చెందిన రాజ్యానాయక్ గ్రామ సమీపంలోని పొలం వద్ద ఉండగా ఓ కుక్క దాడిచేసి రాజ్యానాయక్‌తో పాటు, పశువుల కొట్టంలో ఉన్న ఆవుదూడను తీవ్రంగా గాయపరిచింది. స్థానికులు రాజ్యానాయక్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైందని, వెంటనే కుక్కల బారి నుంచి ప్రజలను, మూగజీవాలను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయంలో చోరీకి యత్నం

నందిగామ: మండల కేంద్రమైన నందిగామ శివ రామంజనేయ స్వామి ఆలయంలో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. హుండీని ధ్వంసం చేసి ఆలయ వెలుపల పడేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని శివ రామంజనేయ స్వామి ఆలయానికి ఆదివారం ఉదయం పూజారులు వచ్చారు. ఆలయ గేటు తాళం ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించారు. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలిపి వారి ఆధ్వర్యంలో పరిశీలించారు. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయం గేటు తాళాన్ని పగుల గొట్టి లోనికి ప్రవేశించి ఉంటారని తెలిపారు. ప్రధాన ఆలయంలోని సాయినాథుడి గుడి తలుపులు పగుల గొట్టి ఉండడాన్ని గుర్తించారు. ఈ విషయమై ఇన్‌స్పెక్టర్ రామయ్యను వివరణ కోరగా.. దుండగులు ఆలయంలో చోరీకి యత్నించే సమయంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం రాకను గమనించి పారిపోయి ఉంటారని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి సబితారెడ్డి



సేవాలాల్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలో ఇంటి పన్నులు అధికంగా ఉన్న విషయాన్ని, అలాగే యూఎల్‌సీ సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని విద్యా శాఖ మంత్రి సబితారెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం వంగా శంకరమ్మ గార్డెన్స్‌లో నిర్వహించిన ఫెడరేషన్ ఆఫ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాలనీల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికా బద్ధంగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ముఖ్యంగా గాయత్రినగర్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు, లలితానగర్ చౌరస్తా నుంచి నందనవనం వరకు గల ప్రధాన రహదారులను త్వరలోనే అభివృద్ధి చేస్తామన్నారు. అదే విధంగా వీధి కుక్కల బెడదను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంటేరు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆంజనేయులు ఎన్నికయ్యారు. సమావేశంలో కాలనీవాసులు ప్రేమ్‌చందర్‌రెడ్డి, వెంకటయ్య, మల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, శివానందం, పద్మాచారి, శ్రావణ్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10 శాతం రిజర్వేషన్ల ఘనత కేసీఆర్‌దే

రాష్ట్రంలో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మంత్రి అన్నారు. ఆదివారం మీర్‌పేట మిథులానగర్ కాలనీలో నిర్వహించిన శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 284వ జయంతి ఉత్సవాలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చాక గిరిజనులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు ఇవ్వడంతో పాటు యూనివర్సిటీని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో సేవాలాల్ మహరాజ్ భవన్ కోసం స్థలాన్ని కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ ఎం దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్ లీడర్ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళా భవన్ ఏర్పాటు చేద్దాం

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీలో మహిళా భవన్‌ను ఏర్పాటు చేసుకుందామని మంత్రి సబితారెడ్డి అన్నారు. ఆదివారం జింకల బావి కాలనీ, డాక్టర్స్ కాలనీల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు, అసోసియేషన్ సభ్యులు కాలనీల్లో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని, ముఖ్యంగా పార్కు సమస్య ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. మహిళలకు ప్రత్యేక భవనానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరదనీటి సమస్యపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారని, వరదనీటి కాలువల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జేబీ కాలనీలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్, డివిజన్ అధ్యక్షులు మహేందర్, మాజీ కార్పొరేటర్ అనితా దయాకర్‌రెడ్డి, నాయకులు లోకసాని కొండల్‌రెడ్డి, కాలనీ అసోసియేషన్ల సభ్యులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంతకాల సేకరణ

మంచాల: ఏప్రిల్ 3న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాకు మద్దతుగా మంచాల మండల పరిధిలోని జాపాల గ్రామంలో ఆదివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ సంఘం రాష్ట్ర నాయకుడు నర్సింహ మాట్లాడుతూ.. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో భాగంగానే వచ్చేనెల ఢిల్లీలో దేశ వ్యాప్తంగా ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఢిల్లీలో జరిగే ధర్నా కార్యక్రమంలో మత్స్య కార్మికులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఆసంఘం నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న సంఘం నాయకులు

ఘనంగా కల్యాణ మహోత్సవం



కల్యాణ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో ఈదమ్మ, మాంధాత దేవాలయంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఈదమ్మ, మాంధాత కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నారాయణ, సర్పంచ్ శ్రీపాతి రజిత, ఎంపీటీసీ మంగమ్మ, స్థానిక నాయకులు శ్రీనునాయక్, రంగయ్య, వెంకట్రాం, రవిగౌడ్ పాల్గొన్నారు.

ఈఎండీ గాడిన పడింది..

- నిమ్స్ ఎమర్జెన్సీ విభాగంలో తీరిన పడకల కొరత
- త్వరితగతిన ఓపీ వైద్య సేవలు
- మంత్రి హరీశ్‌రావు ప్రశంసలు

లక్డీకాపూల్: నిమ్స్‌లో అత్యంత కీలకమైన ఈఎండీ (ఎమర్జెన్సీ మెడికల్ డిపార్ట్‌మెంట్)లో వసతులు మెరుగవడంతోపాటు పడకల సంఖ్య సైతం పెరగడంతో అత్యధిక మంది రోగులకు వైద్యసేవలు సకాలంలో అందుతున్నాయి. దీంతో ఎక్లతరబడి జఠిలంగా మారిన ఈఎండీ సేవలు కొంతమేర గాడినపడ్డాయి. ఇటీవల నిమ్స్‌ను సందర్శించిన వైద్య మంత్రి హరీశ్‌రావు సైతం ఈఎండీ సేవలు బాగున్నాయని ప్రశంసించడం గమనార్హం. మామూలుగా అయితే నిమ్స్ ఈఎండీలో బెడ్ దొరకాలంటే పైరవీ తప్పనిసరి అయ్యేది. గత రెండుల నెలల వరకు నిమ్స్ ఈఎండీకి రావాలంటే ఓ మంత్రి స్థాయి నేత సిఫారసు ఉంటే తప్ప సాధ్యం కాకపోయేది. అలాంటిది ఇప్పుడు రోడ్డు ప్రమాదానికి గురైనా, అత్యవసర పరిస్థితిలో వచ్చినా వెంటనే ఈఎండీలో చేర్చుకునే పరిస్థితికి ఆ విభాగాన్ని చక్కదిద్దారు. ఆస్పత్రి ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప చొరవతో ఆ విభాగం ఇన్‌చార్జిలు, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం అధిపతి డాక్టర్ సునీల్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌ల సమన్వయ కృషి ఫలితంగా ఈఎండీలో ఇప్పుడు కనీసం నాలుగు పడకలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. గతంలో ప్రాణపాయపరిస్థితుల్లో వచ్చినా బెడ్ లేదు.. ముఖ్యంగా వెంటిలేటర్ లేదంటూ బాధితులను తిప్పి పంపించిన సందర్భాలు కోకోల్లలు. కొన్ని సందర్భాలలో రాత్రి వేళ కూడా స్వయానా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీషరావు ఫోన్ చేసి ఫలానా పేషెంట్‌ను వెంటనే చేర్చుకోండంటూ ఆదేశించిన పరిస్థితులు. అలాంటిది సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించడంతో బాధితులు సకాలంలో వైద్యసేవలను పొందగలుగుతున్నారు. ఈ విషయాన్ని ఇటీవల ఆస్పత్రిని సందర్శించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు కూడా పేర్కొనడం చెప్పుకోదగ్గ అంశం.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్



నలందానగర్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

రాజేంద్రనగర్: ఎండా కాలం నేపథ్యంలో రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. డివిజన్ల పరిధిలోని బస్తీలు, కాలనీలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్‌ఓ ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తాచెదారాన్ని ఇంటి వద్దకు వచ్చే చెత్తసేకరణ దారులకు అందించాలన్నారు. ఏ ప్రాంతంలోనైనా చెత్త సేకరణదారులు రాకపోతే స్థానికంగా ఉండే కమిటీకి ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతిరోజూ తాము చెత్త సేకరణదారుల నుంచి హాజరును తీసుకుంటున్నట్లు తెలిపారు. బస్తీలు, కాలనీలలోని చెత్తాచెదారాన్ని పొగు చేసి ఎవరైనా కాలుస్తే తమకు సమాచారం అందించాలన్నారు.

నాలా పరిరక్షణకు న్యాయ పోరాటం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

శంషాబాద్: సాతంరాయి సర్వే నంబరు 2, 5, 6 వద్ద ఫిరంగి నాలాను పూర్తి స్థాయిగా రోడ్డుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్న తీరుపై పట్టణ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో ఉన్న సుమధుర, అపర్ణ కన్‌స్ట్రక్షన్ సంస్థలు రోడ్డు వేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆదివారం తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఫిరంగి నాలాలో గతేడాది ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కలిసి బోర్డు పాతినప్పటికీ దానిని ఉద్దేశపూర్వకంగా తొలగించి రోడ్డుగా మార్చేశారన్నారు. తాజాగా పూర్తి స్థాయిలో రోడ్డుగారే మార్చే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయన్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులతో కలిసి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. నాలా పరిరక్షణకు అవసరమైన న్యాయపోరాటం చేస్తామన్నారు. కౌన్సిలర్లు భద్రునాయక్, సునీత, కుమార్, మన్రజ్‌జాన్, నాజియాబేగం, వెంకటేష్ ముదిరాజ్, రాణి, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, శ్రీకాంత్‌యాదవ్ ఉన్నారు.

భక్తిభావం అలవర్చుకోవాలి



నందిగామ: ప్రతి ఒక్కరూ భక్తి భావం అలవర్చుకోవాలని జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్ సూచించారు. మండలంలోని మామిడిపల్లిలో కొలువుదీరిన బండ మల్లన్న ఆలయంలో ఆదివారం నిర్వహించిన స్వామి వారి కల్యాణంలో ఎంపీపీ రవీందర్ యాదవ్‌తో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణేష్ మాట్లాడుతూ.. పూర్వ కాలం నుంచి కొనసాగుతున్న ఈ జాతర కు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు గోవిందు అశోక్, కుమార్, వెంకట్ రెడ్డి, జేకే నర్సింహ, చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు ఎమ్మె సత్యనారాయణ, దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మా సభ్యుల కోసం ఉచిత వైద్యశిబిరం

రాయదుర్గం: నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో ఆదివారం మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) సభ్యుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి, 'మా' అసోసియేషన్ అధ్యక్షులు మంచువిష్ణులు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌లోని ప్రతి ఒక్కరూ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి కళాకారుడు ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా రక్త పరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కాన్స్, ఎక్స్‌రేలు, 2 డీఎకో తోపాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ మాదాల రవి, కోశాధికారి శివబాలాజీ తదితరులు పాల్గొన్నారు.

స్టార్టప్‌లకు ప్రభుత్వ ప్రోత్సాహం

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రాన్ని 33 జిల్లాల స్టార్టప్ క్యాపిటల్‌గా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని టీఎస్ఐసీ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ శాంతా తౌతం పేర్కొన్నారు. హెచ్‌సీయూలో ఎస్పైర్ సహకారంతో ది ఎంటర్‌ప్రెన్యూర్ జోన్(టీఈజెడ్)వారి ఉమ్మడి-స్టార్టప్ లాంచర్ ప్రోగ్రామ్‌లో పట్టభద్రులైన వారి స్టార్టప్‌ల ధృవీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ స్టార్టప్ కల్చర్‌ను అంతటా అభివృద్ధి చేసేందుకు, వినూత్న పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 45 మంది స్టార్టప్ వ్యవస్థాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు.